హైదరాబాద్ వార్త



# నగర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

## - మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 6 ప్రభాతవార్త**

అంబర్‌పేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపనలు చేశారు. నియోజకవర్గం పరిధిలోని బాగ్ అంబర్‌పేట, నల్లకుంట, బర్కత్‌పుర ప్రాంతాల్లో మాజీ ఎంపి వి.హనుమంతరావు, ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ రోహిన్‌రెడ్డితో కలిసి 4.90 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..వి.హనుమంతరావు, డాక్టర్ రోహిన్‌రెడ్డిల ప్రతిపాదనలతో అంబర్‌పేట నియోజకవర్గంలో దాదాపు 5 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామని వీలైనంత తొందరలో పని పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తున్నానని పేర్కొన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గానికి సంబంధించి ఏ సమస్య నెలకొన్న పరిష్కరిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ముందుకు తీసుకుపోతుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ,500 కి గ్యాస్, కొత్త రేషన్ కార్డులు ఇచ్చే కార్యక్రమం, ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500లు బోనస్, మహిళలకు వడ్డీ లేని రుణాలు, 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. అయితే రాష్ట్రంలో బిఆర్ఎస్ 10 ఏండ్ల పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజల ఆకాంక్షల కనుగుణంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచుతూ అన్ని రకాల కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం పక్షాన రాష్ట్రాల అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నామని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు, వరదలు వచ్చినప్పుడు సహకరించలేదు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణకు సహకరించడం లేదని ఆయన ధ్వజమెత్తారు. పైగా రేవంత్ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు అడ్డుపడుతున్నారని విమర్శించారు. మా ముఖ్యమంత్రి మంత్రులు అధికారులు అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి రాష్ట్ర అభివృద్ధికి సహకరించి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శులు శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, పార్టీ నాయకులు జమీర్ భాయ్, గడ్డం శ్రీధర్ గౌడ్, కోటమ అనిల్ కుమార్, రావుల సుధాకర్, చెంగలి సుధాకర్, సందీప్ గౌడ్, కోట్ల కిరణ్ కుమార్, రాజ్ కిరణ్, మహేందర్, మహేష్ గౌడ్, బస్తీ పెద్దలు సుహాసిన్ రెడ్డి, నాంపల్లి జైహింద్, బాబు, సునీల్ వీర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేటలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో వి.హనుమంతరావు, రోహిన్‌రెడ్డి, శంభుల శ్రీకాంత్, ఉషశ్రీ తదితరులు

# ప్రశాంతంగా ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు

## -ఎగ్జామ్ రాసిన 75,083 మంది విద్యార్థులు -పరీక్షలకు 2412 మంది స్టూడెంట్స్ గైర్హాజరు



**హైదరాబాద్, మార్చి 6,ప్రభాతవార్త:**

ఇంటర్మీడియట్ సెకెండ్ ఇయర్ వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలను పురస్కరించుకుని అధికారులు కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో తమకు కేటాయించిన సెంటర్లకు 20 నిమిషాల ముందే విద్యార్థులు చేరుకున్నారు. కేంద్రాల అడ్రస్ తెలియని వారికి పోలీసులు సాయం అందించి పంపించారు. కాగా సెకెండ్ ఇయర్ తొలి రోజు పరీక్షకు హైదరాబాద్ జిల్లా లో 77495 మంది విద్యార్థులకు 75083 హాజరుకాగా 2412 మంది గైర్హాజరయ్యారు. అందులో 171మంది ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలకు హాజరుకాలేదు. అలాగే జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ నమోదు కాలేదని విద్యాశాఖ ఉన్నతాధికారి తెలిపారు. ఇదిలా ఉండగా పరీక్ష సమయానికి 10 నిమిషాల గ్రేస్ పీరియడ్ ఇవ్వడంతో విద్యార్థులు ప్రశాంతంగా హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలున్న మార్గాల్లో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. వేసవి నేపథ్యంలో కేంద్రాలవద్ద మంచినీటి ఏర్పాటు చేశారు.

# చెరువుల అభివృద్ధికి ఆటంకాలు తొలగిస్తాం

## -పరిసరాలన్నీ ఆహ్లాదంగా మార్చుతాం -హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్

**హైదరాబాద్, మార్చి 6,ప్రభాతవార్త:**

చెరువుల అభివృద్ధిలో ఎక్కడా ఆటంకాలు లేకుండా చూస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. నగరంలోని చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ నిధులను అందించి చెరువుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈమేరకు గురువారం నానక్‌రామ్ గూడలోని ఖాజాగూడ పెద్ద చెరువు, నెక్నాంపూర్‌లోని ఇబ్రహీంబాగ్ చెరువును హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఖాజాగూడ చెరువు అభివృద్ధిలో తలెత్తిన ఇబ్బందులను ఈ సందర్భంగా అక్కడ పనులు చేపట్టిన సంస్థల ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడికక్కడే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి.. చెరువులోకి మురుగు నీరు చేరకుండా కాలువ డైవర్షన్ పనులు చేపట్టాలని సూచించారు. అలాగే పర్యాటకంగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకునేలా ఈ చెరువు పరిసరాలను అభివృద్ధి చేయాలని.. ఇందుకు పర్యటకాభివృద్ధి సంస్థ కూడా భాగస్వామ్యం కావాలని పర్యటనలో ఉన్న ఆ సంస్థ ఏజీఎం వరప్రసాద్‌కు కమిషనర్ సూచించారు. అలాగే నెక్నాంపూర్లోని ఇబ్రహీంబాగ్ చెరువు ఆక్రమణలను ఇటీవలే తొలగించామని.. ఇప్పటికే ఈ చెరువును కొన్ని సంస్థలు దత్తత తీసుకున్నాయని.. ఈ పనులు వేగంగా జరగాలని కమిషనర్ సూచించారు. దుర్గం చెరువు, ఖాజాగూడ చెరువు, మల్కం చెరువు, ఫిలింనగర్ చెరువుల నుంచి వరద నీరు ఇబ్రహీంబాగ్ చెరువుకు చెరేదని స్థానికులు అధికారులు తెలిపారు. నివాసప్రాంతాలు పెరిగిపోవడంతో యీ చెరువులు, నాళాలు మురుగుతో నిండిపోయాయని చెప్పారు. పై ప్రాంతాల నుంచి వచ్చిన మురుగు నీటిని డైవర్ట్ చేసి ఇబ్రహింబాగ్ చెరువును కాపాడలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. మురుగు కంపుతోపాటు దోమలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో .దాదాపు 88 ఎకరాలకు పైగా ఉన్న చెరువు చుట్టూ తిరిగి.. చెరువు అభివృద్ధికి ఉండే అవకాశాలను కమిషనర్ స్థానికులతో చర్చించారు. ఇబ్రహీంబాగ్ చెరువులోకి మురుగు చేరకుండా.. నాలాలను డైవర్ట్ చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. కాలువల డైవర్షన్‌తో పాటు.. ఎస్‌టీపీలు ఏర్పాటుకు, సుందరీకరణ పనులకు స్థానికుల నుంచి కూడా సహకారం అందాలన్నారు.

చెరువుల ఆక్రమణ లకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు తీసు కుంటున్నామని చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులు పూర్తయితే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని కమిషనర్ చెప్పారు.



చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

# రాష్ట్రంలో బిసి సంక్షేమ సంఘాన్ని మరింతగా బలోపేతం చేస్తాం : ఆర్.కృష్ణయ్య

## తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమే

**సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త:**

ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పునావృత్తం అవుతాయని బిసి అభ్యర్థియే సిఎం అవుతారని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారు. బిసిలందరూ బిజెపివైపు ఉన్నారని ఇందుకు ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలే నిదర్శనమని ఆయన చెప్పారు. బిసి ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు 40 బిసి కుల సంఘాలతో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గవ్వల భరత్‌కుమార్‌ను నియమించి, నియామకపత్రాన్ని అందించారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బిసి వాదం బలంగా ఉందని, పోరాటాల ద్వారానే అన్ని రాజకీయ పార్టీలు బిసి నినాదం చేస్తున్నారని స్పష్టం చేశారు. తమ సంఘంలో యువతకు ప్రాదాన్యత కల్పిస్తున్నామని, ఇందులో భాగంగానే యువకుడైన భరత్‌కుమార్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం జరిగిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో కొనసాగుతున్నదని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలో ,, బిజెపి అధికారంలోకి వస్తుందని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టం చేశారు. తాను అర్ధశతాబ్దంగా వేలాది ఉద్యమాలు చేసి బిసిలకు ఎన్నో పథకాలు సాధించడం జరిగిందన్నారు. వేలాది జివోలు వచ్చాయని, బిసిలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాలలో ఇలాంటి పథకాలు లేవని స్పష్టం చేశారు.

ఈ సమావేశం లో బిసి నేతలు గుజ్జ కృష్ణ, డా.ఎస్.మారేష్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, సి.రాజేందర్, పగిళ్ల సతీష్, మట్టా జయంతిగౌడ్, సుధాకర్, భూపేష్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



భరత్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న ఆర్.కృష్ణయ్య

# టెండర్లు ఆలస్యం..అమలుకు జాప్యం...!

## -జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగంపై కార్పొరేటర్ల అసహనం -సిఎం ప్రారంభించిన పథకాలపైనా నిర్లక్ష్యం -పరిపాలనా అనుమతుల లభించినా -కార్యరూపంలోకి తీసుకురాని అధికారులు




**హైదరాబాద్, మార్చి 6,ప్రభాతవార్త:**

జిహెచ్ఎంసిలోని ఇంజనీరింగ్ విభాగంలో నిర్లక్ష్యంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. రూ.5942 కోట్లతో 23 పథకాలను చేపట్టాలని ప్రభుత్వం పరిపాలనా అనుమతులను జారీచేస్తే ఇప్పటికి మూడు నెలలు పూరైనా ఇంజనీరింగ్ విభాగం మాత్రం ఒక్క పథకాన్ని కూడా కార్యరూపంలోకి తీసుకు రాలేదని పలువురు కార్పోరేటర్లు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా ఖాజా గూడ, ఐఐఐటి, విప్రో సర్కిల్ వంటి ప్రాంతాల్లో పథకాలు అమలుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సిఎం రేవంత్ రెడ్డి రూ.5,827 కోట్లకు సంబంధించిన పనులను గత డిసెంబర్ నెలలో ప్రారంభించారు. కానీ మూడునెలలైనా ఇప్పటివరకు దానికి సంబంధించిన టెండర్లను పిలవడంలో ఇంజనీరింగ్ విభాగం ఇంకా ఎలాంటి చర్యలకు పూనుకోలేదు. కేవలం కెబిఆర్ పార్కు చుట్టూర ఫ్లైఓవర్లు, అండర్ పాస్లు నిర్మించేందుకు టెండర్లను పిలిచినా.. దానిపై పలు కోర్టు కేసులు నమోదై ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో హెచ్‌సిటీ పనులు మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అలాగే విప్రో జంక్షన్, ఖాజాగూడ, ఐఐఐటి జంక్షన్ల వద్ద రూ.837 కోట్లతో మూడు మల్టిలేవల్ ఫ్లైఓవర్లను నిర్మించేందుకు పరిపాలనా అనుమతులు లభించాయి. అయితే ఇక్కడ వాటి అమలుకు టీఎస్ఐఐసి, హెచ్ఎంఆర్ఎల్ విభాగాలను ఒప్పించడంలోనూ జిహెచ్ఎంసి కాస్తంత వెనుకబడినట్టు కనిపిస్తుంది. అందుకే జీహెచ్ఎంసితో ఆరెండు విభాగాలు కలిసి రావడానికి ఇష్టపడటం లేదు. అయితే ఖాజాగూడ, విప్రో సర్కిల్, ఐఐఐటి కూడలిలో ప్రతిపాదిత మల్టీలెవల్ ఫ్లైఓవర్ల స్థానంలో సాధారణ ఫ్లైఓవర్లు రానున్నట్టు సమాచారం. ఈ మూడు కూడళ్ళలో విప్రో సర్కిల్ పోయినా మిగతా రెండు కూడళ్ళను కార్యరూపంలోకి తీసుకురావడంలో భాగంగా టెండర్లను పిలవకపోవడం పట్ల పాలకవర్గాలు పెదవి విరుస్తున్నారు.

### ఎన్నికల్లో మేమేం చెప్పుకోవాలి..

ప్రభుత్వం ప్రారంభించిన పథకాల అమలు త్వరగా చేపడితే వచ్చే జీహెచ్ఎంసి ఎన్నికల్లో తాము ప్రచారం చేసుకోవడానికి ఒక అస్త్రంగా ఉంటుందనే ధీమా కాంగ్రేస్ కార్పొరేటర్లలో కనిపిస్తుంది. దీంతో జీహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగంపై ఒతిడి పెంచుతున్నారు. అయితే ప్రధాన కార్యాలయంలో ఓ ఉన్నతస్థాయి ఇంజనీ ర్ తీరుపై కొందరు కిందిస్థాయి ఇంజనీర్లు తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. సెలవు దినాల్లోనూ ఆఫీస్‌కు రావాలనిహుకుం జారీచేస్తున్నట్టు విమర్శిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కార్యాలయాలకే పరిమితం చేస్తూ పనికనా హడావుడే ఎక్కువ ఉందంటూ పెదవి విరిస్తున్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తామని డబ్బులు వసూళ్లు

## -నలుగురు వ్యక్తులు అరెస్ట్



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నగర అడిషనల్ డిసిపి టాస్క్‌ఫోర్సు అందె శ్రీనివాస రావు

**చార్మినార్,మార్చి 6 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి పేద ప్రజల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్న నలుగురు వ్యక్తులను ఛత్రినాక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నింధితుల వద్ద నుంచి లక్ష రూపాయల నగదుతో పాటు పలువురు ప్రభుత్వ అధికారుల నకిలీ రబ్బరు స్టాంపులు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన నకిలీ అలాట్‌మెంట్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం పురానీహవేలిలోని సౌత్ జోన్ టాస్క్ పోర్సు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నగర టాస్క్ పోర్సు అడిషనల్ డిసిపి అందె శ్రీనివాసరావు వెల్లడించారు. ఛత్రినాక ప్రాంతానికి చెందిన ఎం.జ్యోతి (49),పి.సునీల్ సింగ్ (43),సంతోష్ నగర్‌కు చెందిన జి.రమేష్ (23), ఛత్రినాక్‌కు చెందిన ఎల్.నితిన్ కుమార్‌లు కలిసి పేద ప్రజలకు మాయ మాటలు చెప్పి హైదరబాద్ పరిసర ప్రాంతాలలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని మోసం చేస్తున్నారు. పేద ప్రజల నుంచి ఒక్కక్కరి వద్ద ఇరవై వేల రూపాయలు వసూళ్లు చేస్తున్నారు. మొగల్‌పుర ప్రాంతానికి చెందిన గౌరీ అనే మహిళా ఈ విషయమై ఫిర్యాదు చేయటంతో సౌత్ జోన్ టాస్క్ పోర్సు పోలీసులు, ఛత్రినాక పోలీసులు కలిసి ఎం.జ్యోతి, పి.సునీల్ సింగ్, జి.రమేష్, ఎల్.నితిన్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి లక్షల రూపాయల నగదు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల ఆర్‌డిఓలు నకిలీ స్టాంపులు, రెండు వందల నకిలీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల అలాట్‌మెంట్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. జ్యోతిపై మొగల్‌పుర, జూబ్లిహిల్స్ పోలీస్ స్టేషన్లలో ఇదే విషయమై కేసులు నమోదై ఉన్నాయి. ఈ విలేకర్ల సమావేశంలో సౌత్ జోన్ టాస్క్‌పోర్సు ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్ వర్మ, ఎస్ఐలు ఎం.మహేష్, కె.నర్సింహులు, జి,ఆంజనేయులు, ఎన్.నవీన్‌లు పాల్గొన్నారు.

# బాచుపల్లిలో కారు భీభత్సం

## -ఓవర్ స్పీడ్‌తో దుకాణాల పైకి దూసుకెళ్లిన కారు.. -కారుపై మాజీ మంత్రి మల్లారెడ్డి స్టిక్కర్

**నిజాంపేట్, మార్చి 6, ప్రభాతవార్త**

బాచుపల్లిలో కారు భీభత్సం సృష్టించింది. గండిమైసమ్మ నుండి బాచుపల్లి వైపు వెళ్తున్న హుందాయ్ వెర్నా కారు హైదరాబాద్ ప్రగతినగర్ వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్ గేట్ ముందు గల షుగర్ కేన్ దుకాణంపైకీ గురువారం ఉదయం ఓవర్ స్పీడుగా దూసుకు వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో షుగర్ కేన్ దుకాణం ధ్వంసం కావడం తో పాటు ఓ వ్యక్తికీ గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. ఎంఎల్ఆ ర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్టూడెంట్ సుమారు 100 కి.మీ పర్ స్పీడ్‌తో రాష్ డ్రైవింగ్‌తో వచ్చి ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంకు గురైన కారుపై మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి అసెంబ్లీ పాస్ ఉండడం విశేషం.



దుకాణం పైకి దూసుకెళ్లిన కారు

# మహిళల హక్కుల సాధనకు సంఘటితంగా ఉద్యమించాలి

## - డిసిపి రష్మిపెరుమాల్



సికింద్రాబాద్ కోర్టులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న డిసిపి రష్మిపెరుమాల్, జడ్జీ శ్రీవాని మోండా కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్,మార్చి 6 ప్రభాతవార్త:**

మహిళల హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలని ఉత్తర మండలం డిసిపి సాదన రష్మి పెరుమాల్, సికింద్రాబాద్ 6వ ఏ.ఎం.ఎస్.జడ్జీ శ్రీవాని, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపికలు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టులో సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టులో ఏర్పాటు చేసిన వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల్లో, నగరంలోని మురికి వాడల్లో మహిళలు అణిచివేతకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు విద్యాపరంగా అభివృద్ధి చెంది తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న మహిళలను లైంగిక వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో లా కళాశాల ప్రొఫెసర్ లక్ష్మి, రెనోవా ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ గౌతమి, సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వసంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి జె.సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

# నార్మ్‌తో జయశంకర్ వర్సిటీ ఒప్పందం

## - వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

**అత్తాపూర్ మార్చి6, ప్రభాతవార్త :**



ఇటీవల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నెలకొల్పిన మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి సాంకేతిక సహకారం అందించడం కోసం భారత వ్యవసాయ పరిశోధన మండలి సంస్థ అయిన నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ)తో అవగాహన ఒప్పందంపై ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్. సి. అగర్వాల్ మరియు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రా ర్ డాక్టర్ జి.ఈ.సిహెచ్ విద్యాసాగర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య సమక్షంలో సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం వచ్చే మూడు సంవత్సరాలలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు / సిబ్బందికి నూతన అంశాలు, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై నార్మ్ సహకారంతో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా నార్మ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. సి. అగర్వాల్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి తాము ఎప్పుడూ కట్టుబడి ఉన్నామని, అవగాహన ఒప్పందం చేసుకొనుటకు ముందుకు వచ్చిన విశ్వవిద్యాలయ ఉపకులపతిని అభినందించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మానసిక వికాసం అంశాలు మరియు సిబ్బందికి నిర్వహించే సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి మరియు పరిపాలన తదితర శిక్షణ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ మానవ అభి వృద్ధి కేంద్రానికి తమ సంస్థ నుండి పూర్తి సహకారం అందిస్తామని అగర్వాల్ తెలియజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు డాక్టర్ బలరాం, డాక్టర్ ఝూన్సీరాణి మరియు డాక్టర్ వి. రాములు నార్మ్ అధికారులు పాల్గొన్నారు.

## మొట్టమొదటి శస్త్రచికిత్సా రోబోట్ - ఎస్ఎస్ఐ మంత్ర 3.0

**పేట్‌బషీరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త**

తెలంగాణ వైద్య రంగంలో విప్లవాత్మకమైన ముందడుగుగా, మల్లా రెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి రాష్ట్రంలోని మొట్టమొదటి శస్త్రచికిత్సా రోబోటిక్ వ్యవస్థ ఎస్ఎస్ఐ మంత్ర 3.0 ను విజయవంతంగా ప్రవేశపెట్టింది. గురువారం మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చి. మల్లా రెడ్డి (మల్లా రెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపకులు, చైర్మన్) చి. కల్పన రెడ్డి (మల్లా రెడ్డి విశ్వవిద్యాలయ ఛాన్స్‌లర్) హాజరయ్యారు. డా. చి. భద్రా రెడ్డి (మల్లా రెడ్డి విశ్వవిద్యాపీఠం చైర్మన్), డా. చి. ప్రీతి రెడ్డి (వైస్ చైర్మన్) ముఖ్య సంరక్షకులుగా ఈ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఆధునిక వైద్యసేవలకు మల్లారెడ్డి ఆసుపత్రి నిబద్ధత ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో తొలి శస్త్రచికిత్సా రోబోటిక్ వ్యవస్థను ప్రవేశపెట్టడం మల్లా రెడ్డి ఆసుపత్రికి గర్వకారణం. ఇది వైద్యసేవల్లో నూతన దశను ప్రారంభిస్తోంది. అత్యంత ఖచ్చితంగా, తక్కువ సమయంలో శస్త్రచికిత్స చేయడం, రోగులకు వేగంగా కోలుకునే అవకాశాన్ని కల్పించడం దీని ప్రత్యేకత. రాష్ట్ర ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్యసేవలను అందించడంలో మేము ఎప్పుడూ ముందుండాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ ఆవిష్కరణ తెలంగాణను అత్యాధునిక వైద్యసాంకేతికతల వినియోగంలో ముందుండే రాష్ట్రంగా నిలబెడుతుందని అన్నారు.

## నిబంధనల విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోండి



అడిషనల్ కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

**నిజాంపేట్, మార్చి 6, ప్రభాతవార్త**

బాచుపల్లి వాసవి కన్స్‌స్ట్రక్షన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోమటి కుంట చెరువు ఎఫ్టిఎల్ బఫర్ జోన్‌లో నిర్మాణం ఉన్నాయని ఎలాంటి ఎన్ఓసి ఇవ్వరాదని అడిషనల్ కలెక్టర్‌కు పూర్తి ఆధారాలతో ఆకుల సతీష్ ఫిర్యాదు చేశారు. తక్షణమే వాసవి కన్స్‌స్ట్రక్షన్ 8,9 బ్లాక్ పై చట్టరీత్యా చర్యలు తీసుకొని, చెరువును పునరుద్ధరించి ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, అరుణ్ రావు, మాధవరావు ,శ్యాం తదితరులు పాల్గొన్నారు.

## 13 నుంచి తెలుగు రాష్ట్రాలలో యువజనోత్సవాలు

**సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త:** ప్రపంచ రోటరాక్ట్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 13 నుంచి 19 వరకు రెండు తెలుగు రాష్ట్రాలలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామని ప్రముఖ ఇంద్రజాలికుడు, రోటరీ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ యూత్ చైర్మన్ టి.విజయకాంత్ తెలిపారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం, గంజాయి, పొగాకు అనేవి యువత ఎక్కువగా ఉపయోగించుకుంటే తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మూడు మాదక ద్రవ్యాలను దూరం చేసేందుకు మంచి ఆహారాలు, క్రమం తప్పకుండా వ్యాయామం, క్రీడలతో జీవితానికి ఆరోగ్యకరమైన విధానాన్ని ప్రోత్సహించడానికిగాను యువతకు వరల్డ్ రోటరాక్ట్ డే సందర్భంగా అవగాహన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే వీటితోపాటు యువతులకు సాధికారతపై సదస్సులు, మురికవాడల్లో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు, పిల్లలకు మ్యాజిక్, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేప డతామన్నారు. ఇందులో భాగంగా 13వ తేదీన నిజాం కళాశా లలో యోగ, ట్రెడిషనల్ గేమ్స్ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్ర మంలో హైకోర్టు కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డా.రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

## అకౌంట్ నిర్వచనంలో కాస్ట్ అకౌంటెంట్ చేర్చాలని విజ్ఞప్తి



అదాయపు పన్ను బిల్లును ఆవిష్కరిస్తున్న లావణ్య

**సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదాయపు పన్ను బిల్లును స్వాగతిస్తున్నామని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ తెలిపింది. ఇది దేశంలో ఆరు దశాబ్దాల నాటి ప్రత్యక్ష పన్నుల వ్యవస్థ సరళీకృతం చేయడానికి ఒక ముఖ్యమైన మైలురాయిగా గుర్తిస్తున్నామని ఐసిఎంఏఐ హైదరాబాద్ ఛాప్టర్ చైర్‌పర్సన్ సిఎంఎ డా.లావణ్య కందూరి చెప్పారు. ఈ మేరకు గురువారం హిమాయత్‌నగర్‌లోని ఇనిస్టిట్యూట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్ తరపున వికసిత్ భారత్-2047 విజన్ సాకారం చేసేందుకు మా పాత్రను సమర్థవంతంగా పోషించడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. పన్ను విధానం, అనుసరణ, వ్యయ నియంత్రణ, ఆర్థిక, వ్యూహాత్మక ప్రణాళికల ముఖ్యమైన రంగాలలో కాస్ట్ నైపుణ్యాన్ని గుర్తించాలన్నారు. అకౌంట్ నిర్వచనంలో కాస్ట్ అకౌంటెంటె చేర్చాలని ఆమె కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఛాప్టర్ కార్యదర్శి సిఎంఎ ఖాజా జలాలుద్దీన్, కేంద్ర మండలి సభ్యులు డా.మూర్తి పాల్గొన్నారు.

## 5 కె రన్ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు..

**పంజగుట్ట, మార్చి 6 (ప్రభాతవార్త):** మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలో పలు ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని నగర పోలీసులు తెలిపారు. మార్చి 8 వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 5 కె రన్ జరుగనుంది.దీని ప్రకారం..పీపుల్స్ ప్లాజానుండి నెక్లెస్ రోటరీ మీదుగా తెలుగుతల్లి జంక్షన్ వరకు రన్ నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ట్రాఫిక్ మళ్లింపులు ఏయనున్నారు. 8 వ తేదీ ఉదయం 6 గంటలనుండి 9 గంటల వరకు ఈ నిబంధనలు అమలులో ఉండనున్నాయి. బుద్ధభవన్, నల్లగుట్ట రోడ్డు,నెక్లెస్ రోటరీ, వీవీ స్టాట్యూ, తెలుగుతల్లి జంక్షన్,సెక్రెటేరియట్ నార్త్ ఈస్ట్ గేట్ ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్‌ను కర్బాలా, రాణిగంజ్,ఐమ్యాక్స్, మింట్‌లేన్ రోడ్,షాదన్,నిరంకారి,ఇక్బాల్ మినార్,అప్పర్ ట్యాంక్ బండ్,మింట్‌లేన్ ప్రాంతాల గుండా ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. వాహనదారులు సహకరించాలని నగర ట్రాఫిక్ అదనపు కమీషనర్ జోయల్ దేవిస్ కోరారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా దుకాణాలు నడుపుకుంటాం: సిఓకు విజ్ఞప్తి

**కంటోన్మెంట్,మార్చి 6 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ జూబ్లీ బస్టేషన్ సమీపంలోని కంటోన్మెంట్ బోర్డు ఆధీనంలోని నాలా పక్కన ఉన్న స్థలాల్లో గత 30 సంవత్సరాల నుంచి దుకాణాలను ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నామని, దుకాణాలను తొలగిస్తే తమ కుటుంబాలు వీధి పాలు అవుతాయని బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్‌కు, బస్ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తమ వ్యాపారాలు జరుపుకుంటున్నామని సిఈఓకు విజ్ఞప్తి చేశారు.

## దేశంలో అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రతా బీమా పెన్షన్స్ ప్రవేశపెట్టాలి

### -ప్రొఫెసర్ సంతోష్ మెహ్రోత్రా

**పంజగుట్ట, మార్చి 6 (ప్రభాతవార్త):** సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) ఏడవ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రోజు సెస్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ రేవతి ఆహ్వానం పలకగా, సెస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన ప్రొఫెసర్ జె. మహేందర్ రెడ్డిగారు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా జర్మనీలోని ఐజెడ్ ఎ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్‌కు చెందిన రీసెర్చ్ ఫెలో ప్రొఫెసర్ సంతోష్ మెహ్రోత్రా విచ్చేసి ప్రసంగించారు.ఈ సంధర్భంగా సంతోష్ మెహ్రోత్రా మాట్లాడుతూ దేశంలో 2040 నాటికి జనాభాలో యువత శాతం తగ్గిపోతుందని అన్నారు. భారతదేశం వృద్ధాప్య సమాజంగా ఎలా మారుతుందనే దానిపై ఆయన ఉపన్యాసం దృష్టి సారించింది. దేశంలో 91 శాతంమంది కార్మికులు అసంఘటిత రంగంలో ఉన్నారు. దేశ జనాభాలో కేవలం 12 శాతం మంది మాత్రమే అధికారిక పెన్షన్ పథకం ద్వారా లబ్ది పొందుతున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం వృద్ధుల జాబితాలో చేరే దాదాపు ఐదు మిలియన్ల మంది భారతీయులలో, ఎక్కువ మంది వృద్ధులే కావడం కొంత కలవరపెట్టే అంశం అన్నారు. వీరిలో సుమారుగా 55 కోట్ల మందికి ప్రసూతి ప్రయోజనాలు, మరణం లేదా వైకల్య భీమా లేదా పెన్షన్‌లను పొందే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. అయితే అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం ప్రభుత్వాలు వారందరికీ సామాజిక భీమా భద్రతా కల్పించాలి. కానీ అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులను ప్రభుత్వాలు వారి భద్రతా విషయాన్ని విశ్మరిస్తున్నాయని అన్నారు. ఫలితంగా వారి కుటుంబ సభ్యులకు ఆసరా లేకుండా పోతుందని అన్నారు. సామాజిక భీమా భద్రతా పేద మరియు మధ్యతరగతి కార్మిక కుటుంబాలకు ఎంతో ప్రయోజనం అన్నారు. ఈ విషయంపై ప్రభుత్వాలు సమాలోచనలు చేసి సత్వరంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.పేద అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వం వాటాగా చెల్లించే సామాజిక భద్రతా బీమాను అందించడానికి జాతీయ ఆదాయంలో 0.69 శాతం లేదా 137 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. దేశంలో రాబోయే 10 నుండి 15 సంవత్సరాలలో అర్హత కల్గిన శ్రామిక వర్గానికి సామాజిక బీమా ఎలా అందించాలో వివరంగా వివరించారు. ఈ సమావేశంలో సెస్ వ్యవస్థాపక సభ్యులైన డా. జి. ఆర్ రెడ్డి, వివిధ విశ్వవిద్యాలయకు చెందిన ఆచార్యులు అధికారులతో పాటు సెస్ అధ్యాపకులు,విద్యార్థులు బోధనేతన సిబ్బంది పాల్గొన్నారు.

## పాతబస్తీలోని వస్త్రాల మార్కెట్లలో రంజాన్ సందడి



రంజాన్ మాసం సందర్భంగా పలు రకాల తివాచీలు విక్రయిస్తున్న దృశ్యం

**చార్మినార్,మార్చి 6 ప్రభాతవార్త :** పాతబస్తీలోని పలు మార్కెట్లలో రంజాన్ మాసం సందడి కనిపిస్తున్నది.మార్చి నెల రెండవ తేదీ నుంచి రంజాన్ మాసంప్రారంభం అయ్యింది.రాత్రి వేళల్లో పాతనగరంలోని వస్త్రాలు మార్కెట్లు,రెడిమెడ్ షాపులు,గాజుల షాపులు నిత్యావసర సరుకుల దుకాణాలు రద్దీగా ఉంటున్నాయి.ముస్లింలకు రంజాన్ పెద్ద పండుగ కావటంతో ముస్లింలు పండుగకు కావలసిన బట్టలు,ఆహార వస్తువులు కొనుగోలు చేస్తున్నారు.మదీనా,పటేల్ మార్కెట్,బిజె మార్కెట్,ఆర్‌జె మార్కెట్,గాడ్ గిఫ్ట్ మార్కెట్,ముంతాజ్ మార్కెట్,గోపాల్ మార్కెట్,ఉర్దూ గల్లీ వస్త్రాల మార్కెట్,ఘాన్సీ బజార్‌లోని వస్త్రాలు మార్కెట్లలో ముస్లింలు పండుగకు సంబంధించిన పలు రకాల వస్త్రాలు ఖరీదు చేస్తున్నారు.చార్మినార్ పరిసర ప్రాంతాలలోని ఫుట్ పాత్‌లపై కూడ వస్త్రాలను విక్రయిస్తున్నారు.మసీదులలో పరిచే తివాచీలను దివాన్ దేవిడి షాపులు,మహ్మద్ క్యాప్‌మార్ట్‌తో పాటు ఇతర షాపులలో కొనుగోలు చేస్తున్నారు.గాజుల విక్రయాలకు ఎంగానె ప్రసిద్ధి గాంచిన చార్మినార్ సమీపంలోని లాడ్‌బజార్ గాజుల దుకాణాలలో అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. చార్మినార్ .పరిసర ప్రాంలతాలలో పెద్ద ఎత్తున పండ్ల వ్యాపారాలు జరుగుతున్నాయి.పండ్ల ధరలు విపరీతంగా పెరిగినప్పటికి రంజాన్ మాసం సంర్భంగా ముస్లింలు పండ్లు ఖరీదు చేస్తున్నారు.పాతనగరంలోని వస్త్రాల మార్కెట్లతో పాటు నిత్యావసర సురుకుల షాపులలో జోరుగా కొనుగోలు జరుగతుండటంతో రంజాన్ సందడి కనిపిస్తున్నది.చార్మినార్,హుస్సే నీఆలం,మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ల పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బహదూర్‌పుర లారీ మెకానిక్ వర్క్‌షాపులో అగ్ని ప్రమాదం



బహదూర్‌పుర లారీ మెకానిక్ వర్క్‌షాపులో మంటలు ఎగిసి పడుతున్న దృశ్యం

**చార్మినార్,మార్చి 6 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర చౌరస్తా సమీపంలోని ఓ లారీ వర్క్ షాపులో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్లు రప్పించి మంటలను ఆర్పివేశారు. బహదూర్‌పుర పోలీసుల కథనం ప్రకారం బహదూర్‌పుర చౌరస్తా సమీపంలో సలీం అనే వ్యాపారికి లారీ మెకానిక్ వర్క్ షాపు ఉంది.వర్క్ షాపులో పాత లారీలకు సంబంధించినభాగాలను వేరు చేసి విక్రయిస్తుంటారు.కాగా గురువారం రాత్రి వర్క్ షాపు నుంచి మంటలు లేచి వ్యాపించాయి.మంటలు అంటుకుని పాత లారీలకు చెందినభాగాలు కాలి పోయాయి.ప్రక్కనే ఉన్న భవనానికి మంటలు వ్యాపించటంతో విద్యుత్ వైర్లు కాలిపోయాయని బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రఘునందన్ వెల్లడించారు.పోలీసులు సకాలంలో అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేయటంతో పెద్ద ప్రమాదం తప్పింది, ఎంత ఆస్తి నష్టం జరిగింది అన్న విషయం తెలియవలసి ఉంది.ఈ కేసును బహదూర్‌పుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణలో దూసుకుపోతున్న కమలం

**నిజాంపేట్, మార్చి 06, ప్రభాతవార్త**

తెలంగాణలో బిజెపి ఎక్కడ ఉంది అనే వాళ్లకి కర్రు కాచి వాత పెట్టిన ఓటర్లు తెలంగాణ శాసన మండలికి జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులైన మల్కా కొమురయ్య, చిన్న మైల్ అంజి రెడ్డి ఉత్తర తెలంగాణలోని రెండు కీలక ఎమ్మెల్సీ గెలిసి రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రత్యామ్న రాజకీయ శక్తిగా ఎదిగిందని చాటిచెప్పారు. గురువారం నిజాంపేట బిజెపి అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ మీడియాతో మాట్లాడుతూ బూటకపు ఉచిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సంవత్సర కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని ఓడిపోతే ఈవీఎంల పైన విశ్వాసం లేదని ప్రకటించే కుహన రాజకీయవాదులు బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల విజయం కాంగ్రెస్ ప్రభుత్వం పాలన పైన ప్రజలలో నమ్మకాన్ని కోల్పోవడమేనని అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలలో డబ్బుల కట్టలతో పనిచేసే రాజకీయ నాయకులు ఉంటే భారతీయ జనతా పార్టీలో దేశం కోసం, ధర్మం కోసం సిద్ధాంతం కోసం పనిచేసే కాషాయ జండా కార్యకర్తలు ఉన్నారని అన్నారు. రాబోయే రోజుల్లో జరిగే కార్పొరేషన్, స్థానిక సంస్థలకు సంబంధించిన ఏ ఎన్నికల్లోనైనా భారతీయ జనతా పార్టీ కాషాయ జెండాను ప్రతి ఊళ్లో ఎగరవేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు పనిచేస్తున్నారని అన్నారు. దేశంలోని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని దేశ ప్రజలందరూ ఆమోదిస్తున్నారని అలాగే నిజాంపేట కార్పొరేషన్ లో కూడా కాషాయ జెండా ఎగరడం ఖాయమని తెలియజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఎపుడు ముందుంటుంది

**యూసుఫ్‌గూడ, మార్చి 6, ప్రభాతవార్త :**

ప్రజా అవసరాలను తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎపుడు ముందుంటుందని గ్రేటర్ మాజీ ఉపమేయర్ బోరబండ కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ అన్నారు. బోరబండలోని భరత్‌నగర్‌లో రూ.23లక్షల వ్యయంతో నూనతంగా ఏర్పాటు చేస్తున్న సిసిరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అహర్నిషలు, ప్రజాపాలన కోసం కృషిచేస్తున్నారని ప్రజలకు ఎక్కడ అవసరాలు ఉన్న ఆ సమస్యల పరిష్కారానికి అవసరమయ్యే విధంగా నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. బోరబండను బంగారు బండగా తీర్చిదిద్దే బాధ్యత తాను తీసుకున్నానని ఇప్పటికే కోట్లాది రూపాయలతో బోరబండ డివిజన్ పరిధిలోని బస్తీల కాలనీలను సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. తాను అన్నివేళల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవే తన ధ్యేయంగా ముందుకు వెళుతున్నానని పేర్కొన్నారు.ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న తాను అందుబాటులో ఉంటానని తన సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు సయ్యద్ కయ్యూమ్, ఇమ్రాన్, శ్రీధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## హెబ్రోను చర్చి ప్రతిష్టకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

### -సొసైటీ అధికార ప్రతినిధి రాగి వీరాచారి

**చిక్కడపల్లి, మార్చి 6 ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన క్రైస్తవులకు ఆరాధ్యదైవమైన హెబ్రోన్ చర్చ్ విషయంలో వస్తున్న అవాస్తవాలను ఎవరూ నమ్మవద్దని హెబ్రోన్ చర్చ్ సొసైటీ అధికార ప్రతినిధి రాగివీరాచారి అన్నారు. ఈ ఆరోపణలను గురువారం పత్రికా విలేకరుల సమావేశంలో ఖండించారు. గత కొంతకాలంగా చర్చి నిర్వహణలో సొసైటీ, ట్రస్టులకు ఉన్న విభేదాలకు స్వస్తి పలుకుతూ ఇరు వర్గాలు కలసి కోర్టు ఉత్తర్వుల ప్రకారం చర్చి నిర్వహణ చేస్తున్నామని తెలిపారు. సుమారు 25 మంది చట్ట వ్యతిరేకంగా చేస్తున్న కార్యక్రమాల విషయమై న్యాయస్థానం తుది తీర్పు వెలువరించే వరకు చర్చి నిర్వహణలో ఎటువంటి జోక్యం చేసుకోవద్దని 25 మందిని హెచ్చరించి తీర్పునిచ్చింది. వీరిలో ఎక్స్ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు రాజకీయ బలముతో, బెస్టర్ రక్షణ టీవీ మీడియా బలముతో, రూబెన్ ఫ్రాన్సిస్ పీటర్ ఫ్రాన్సిస్ స్థానిక అధికార బలంతో, ఏను పాదం లోకల్ పాస్టర్ల అండతో ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. తనపై 12 కేసులున్నాయని, ఆరెస్టు కాకుండా తప్పించుకొని తిరుగుతున్నానని అబద్ద ప్రచారాలు చేస్తూ విద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారని తెలిపారు. సివిల్ నేచర్లో కేసులన్ని కొట్టివేయగా కేవలం గత ఏడాది పెట్టిన రెండు కేసులు మాత్రమే పెండింగులో వున్నాయన్నారు. రాగి వీరాచారి పారిపోయాడని కనబడితే అరెస్టు చేయాలని సొసైటీ, ట్రస్ట్ సభ్యులు అడ్డంకి ఇమ్మానియేల్, మ్యాథ్యూస్ చేస్తున్న అబద్ద ప్రచారం సోషల్ మీడియాలో చేస్తూ హెబ్రోను ప్రతిష్టతను దెబ్బతీయడానికి పూనుకున్నారని వాపోయారు. ఇటువంటి బెదరింపులకు భయపడేది లేదని హెబ్రోను చర్చి ప్రతిష్టితకు భంగం కలిగించే విధంగా ఎవరు ప్రయత్నించిన ఉపేక్షించేది లేదని తెలిపారు. హెబ్రోను చర్చి ఆవరణంలోని ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేయబడిన ఈ పత్రికా సమావేశంలో పలువురు చర్చి సభ్యులు మరియు పాస్టర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గొప్ప దైవజనుడైన థియోడర్ రెజినాల్డ్ గారిని కోల్పోవడం విచారకరమని నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి మరియు సంఘానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఉమెన్ పెన్షనర్స్ ఫోరం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

**సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉమెన్ పెన్షనర్స్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు తెలుగు విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరంలో ఘనంగా జరిగాయి. ఫోరం చైర్ పర్సన్ ఆర్.ఉమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరేళ్ళ శారదా, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల గద్దర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయో వృద్ధులు నేటి యువతకు మార్గదర్శకులని వారిని గౌరవించడం అందరి బాధ్యతని చెప్పారు. మార్చి 8వ తేదీ మహిళ ల కోసం కేటాయించిన రోజు కాదని, మహిళల సమస్యల పరిష్కారంకు చర్చించుకోవాలని శారద సూచించారు. మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాలలో ముందుకు వెళుతున్నప్పటికి వారి పైన అఘాత్యాలు జరుగుతున్నాయని, వీటిపై చర్చించు కోవాలని, ప్రతి రోజు సమస్యలు వస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు.

## కృష్ణమాదిగ ఎన్ని కుట్రలు చేసినా వర్గీకరణకు చట్టబద్దత జరిగి తీరుతుంది : పిడమర్తి రవి



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

**సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త:** మూడు దశాబ్దాలుగా వర్గీకరణ ఉద్యమాన్ని తానే చేస్తున్నానని చెప్పుకుంటూ మరొక వైపు సిఎం రేవంత్‌రెడ్డి చేసిన వర్గీకరణపై తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని తట్టుకోలేక ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సిఎంపై అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ పూర్వ ఛైర్మన్ పడమర్తి రవి ఆరోపించారు. వర్గీకరణపై క్రెడిట్ తనకు రాదని, కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌రెడ్డికి పోతుందని కృష్ణ మాదిగ నేతకాని సామాజిక వర్గంపై తుపాకి పెట్టి మాదిగ జాతిని కాల్చుతున్నారని ఆయన విమర్శించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణమాదిగకు వర్గీకరణ అంటే ఇష్టం లేదని, వర్గీకరణ జరిగితే తన దుకాణం బంద్ అవుతుందని అందుకే ఆయన వివిధ కుల సంఘాల నాయకులతో వర్గీకరణ అపాలని సిఎంకు, షమీర్ అక్తర్ కమిషన్‌కు వినతి పత్రాలను ఇప్పిస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణపై షమీర్ అక్తర్ కమిషన్ నివేదికను రాష్ట్ర క్యాబినేట్ యధావిధిగా ఆమోదించడం హర్షణీయమన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణకు చట్టం ఇదే విధంగా ఉండాలని మాదిగలు కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. కృష్ణమాదిగ ఎన్ని కుట్రలు చేసినా, ఆయన ట్యాంక్‌బండ్‌లో దూకినా వర్గీకరణ కాదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వర్గీకరణకు చట్టబద్దత అయిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా 'మాదిగల కృతజ్ఞత యాత్ర' చేస్తామని, 10 రోజుల్లో 33 జిల్లాల్లో యాత్ర కొనసాగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు బూదాల బాబురావు, రాపోల రాములు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు : ఎస్ఈ శ్రీ రామ్ మోహన్



కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎస్ఈ డి.రామ్ మోహన్,డిఈ రత్నాకర్‌రావు,విద్యుత్ అధికారులు

**మైలార్‌దేవ్‌పల్లి,మార్చి 6 ప్రభాతవార్త :** వేసవి కాలంలో విద్యుత్ వినియోగానికి అనుగుణంగా మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈ డి.శ్రీ రామ్ మోహన్ అన్నారు.రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని గగన్‌పహాడ్, లక్ష్మీగూడ,శాస్త్రి పురం ప్రాంతాలలోని విద్యుత్ ఫీడర్ల లోడ్‌ను విభజించి నూతనంగా ఏర్పాటు చేసిన ఫీడర్లను ఎస్ఈ శ్రీ రామ్ మోహన్, డిఈ రత్నాకర్ రావు, డిఈ చంద్రశేఖర్ (లైన్స్) డిఈ చంద్రశేఖర్ (పొటక్షన్) తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈ డి.శ్రీ రామ్ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఉద్దేశ్యంతో నిధులు కొరత లేకుండ కోట్లాది రూపాయలతో మౌలిక వసతులు కల్పిస్తున్నదని తెలియజేశారు.ప్రతీ సెక్షన్‌లో కొత్తగా విద్యుత్ ఫీడర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డిఈ రత్నాకర్ రావు,గగన్ పహాడ్ ఏడిఈ ఈశ్వర్ ప్రసాద్,అసిస్టెంట్ ఇంజనీర్లు రవీందర్,ప్రవీణ్, శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**పంజగుట్ట,మార్చి 6 (ప్రభాతవార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బీఎన్ఐ క్యాపిటల్ ఛాప్టర్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ చాప్టర్లో 120 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన అర్గలా హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ డాక్టర్ శ్రీదేవి యాదవల్లి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని చెప్పారు. ఈ 90 నిమిషాల సమావేశంలో సభ్యులు వ్యాపార మార్పిడిని జరిపిన విధానం నెట్‌వర్కింగ్ శక్తిని ప్రదర్శించిందన్నారు. బీఎన్ఐ రూపొందించిన ఈ మోడల్ వ్యాపార మార్పిడికి అత్యంత విశ్వసనీయమైన మార్గంగా నిలుస్తుందని చెప్పారు. సమయాన్ని కచ్చితంగా అమలు చేసే విధానం అందరికి ఆదర్శప్రాయం అన్నారు. ఈ సందర్భంగా మహిళా సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఎన్ఐ కాపిటల్ అధ్యక్షుడు పంకజ్ సురానా, ఉపాధ్యక్షుడు అనుదీప్ తోమ్మండ్రు, కార్యదర్శి, కోశాధికారి సిరిష అడేపు తదితరులు పాల్గొన్నారు. బీఎన్ఐ ప్రపంచ వ్యాప్తంగా 40 ఏళ్లగా వ్యాపార నెట్‌వర్కింగ్, వ్యాపార రిఫరల్స్‌కు మార్గదర్శకంగా ఉంది. ప్రస్తుతం 79 దేశాల్లో 3.4 లక్షలకు పైగా సభ్యులతో ఉంది. ఖిగివర్స్ గెయిన్‌ఖి అనే సూత్రంతో సభ్యులకు నెట్‌వర్కింగ్, సహకారం, విజ్ఞానం, వ్యాపార రిఫరల్స్‌ను అందిస్తుంది.

## అభ్యర్థుల గెలుపుతో బిజెపి నాయకులు సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న బీజేపి నాయకులు.

**యూసుఫ్‌గూడ, మార్చి 6, ప్రభాతవార్త :**

టీచర్స్, పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపి అభ్యర్థులు గెలవడంతో పెద్ద ఎత్తున విజయోత్సవ సంబరాలను జరుపుకున్నారు. రహ్మత్‌నగర్ చౌరస్తాలో డివిజన్ బీజేపి అధ్యక్షులు తంగెళ్ళపల్లి లక్ష్మన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్. కొమరయ్య, అంజిరెడ్డి గెలుపు సందర్భంగా విజయోత్సవ సంబరాలలో భాగంగా బాణ సంచాలు పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో బంగారు ప్రశాంత్, కొలన్ సత్యనారాయణ, ప్రేమ్‌కుమార్, కుంబాల గంగరాజు, రాజేష్, సంజీవ్, శ్రీనువాస్‌రెడ్డి, రాకేష్ యాదవ్, విశాల్‌సింగ్, సౌభాగ్యలక్ష్మీ, శైలజ, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ వెలుగులోకి రావాలంటే పోటీలు అనివార్యం

### -తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రా డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి

**చిక్కడపల్లి, మార్చి 6 ప్రభాతవార్త:** ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పోటీలలో విజేతలైన రెండు తెలుగు రాష్ట్రాల ప్రతిభావంతులకు గురువారం సాయంత్రం అవార్డుల మహోత్సవం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఘనంగా జరిగింది. తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రా డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ప్రతిభ వెలుగులోకి రావాలంటే పోటీలు అనివార్యం అని అన్నారు. విద్యబోధనలో ప్రతిభతో పాటు నైతిక విలువల విద్య అనివార్యమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్య విషయంలో ఎంతో శ్రద్ధతో ఉన్నారని పేర్కొన్నారు. విజేతలైన రెండు రాష్ట్రాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, కరస్పాండెంట్ లకు అవార్డులు అందజేశారు. కార్యక్రమానికి కళారత్న మల్లం రమేష్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో సినీ నటులు అశోక్ కుమార్, జెన్నీ, ఘర్షణ శ్రీనివాస్, ప్రముఖ సైకాలజిస్ట్ బి వి సత్య నగేష్, ఐబిఓ డైరెక్టర్ అంతోటి రామకృష్ణ తెలంగాణ ఇన్చార్జ్ కావ్య ఆంధ్ర ప్రదేశ్ ఇంచార్జ్ అజిత్ బేగ్, గాయకులు మొగిలి వెంకటేశ్వర్లు, నాగసాయి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు రామకృష్ణను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయుల ను, కళాకారులను, ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ స భ్యులను చైర్మన్ నర్సింహారెడ్డి రెడ్డి గారు సత్కరించారు. విజే తలను అభినందించారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

## జలసౌధలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు

**హైదరాబాద్, మార్చి 6,ప్రభాతవార్త:**

మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఎర్రమంజిల్‌లోని జలసౌధలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా మహిళా అధికారులు, ఇతర మహిళా సిబ్బంది అందరూ గత మూడు రోజులనుండి తమ హోదాలను మరిచి సాంస్కృతిక కార్యక్రమాలు ,ఆటలపోటీలలో పాల్గొన్నారు. ఈసందర్భంగా గేమ్స్ మ్యూజిక్ చైర్, తంబోలా, లెమన్ స్పూన్, డాన్సింగ్, సింగింగ్ , పాస్‌దిబాల్, అంత్యాక్షరి, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈవేడుకల్లో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ దేవి, శ్రీదేవి, ప్రమీల, విద్యావతి, పద్మావతి సూపరింటెండెంట్స్, సీనియర్ అసిస్టెంట్స్, జూనియర్ అసిస్టెంట్స్, క్లాస్ ఫోర్త్ ఎంప్లాయిస్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్‌పాల్గొన్నారు. గురువారం సాయంత్రం జరిగిన ముగింపు సమావేశాలకు వాలంటరీ డైరెక్టర్ జనరల్ అనిత పాల్గొని అందరికీ శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం ప్రసంగించారు. జలసౌధలో మహిళా ఉద్యోగులు అందరూ ప్రతినెలా కొంత అమౌంట్ సేకరించి చేసి కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసుకొని ఆపదలో ఉన్న మహిళా ఉద్యోగులకు సహాయం అందించాలని కోరారు.

## సైబర్‌నేరాల అదుపుపై ప్రజాచైతన్యం మరింత పెరగాలి : శివయ్య

**కుత్బుల్లాపూర్,మార్చి6 ప్రభాతవార్త**

సైబర్‌నేరాల అదుపుకు నిరంతరం శ్రమించి ప్రజలకు చేరువైన విధానం అభినందనీయమని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం ప్రతినిధులు అన్నారు. జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ సైబర్‌నేరాల అదుపువిభాగంలో జాతీయ స్థాయి అవార్డును కైవసం చేసుకున్న సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఆయనను సత్కరించారు. ఈందర్భంగా సైబర్‌నేరాల వలలో పడి తీవ్రంగానష్టపోతున్న ప్రజల్ని ఎలాఅప్రమత్తం చేయాలో వివిధ అంశాలను ప్రజలకు తెలియపనిచేందుకు గడ్డంమల్లేశ్ నాయకత్వంలో చేస్తున్న కృషిని అభినందించారు. ఈసందర్భంగా ఎఫ్ఐసిసిఐ జాతీయ స్మార్ట్‌పోలీసింగ్ అవార్డును అందుకున్న సందర్భంగా గడ్డంమల్లేశ్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్య ప్రతిని ధులు పి.శివయ్య, రావుల వరప్రసాద్, వెంకటేశ్వర రావు, ఆర్.ఎన్.చారి పలువురు ప్రైవేట్ పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆధ్యాత్మికత ప్రాధాన్యతను తెలపాలి : గురుపూజా పండిట్ రామిరెడ్డి

**కుత్బుల్లాపూర్,మార్చి6 ప్రభాతవార్త**

సమాజంలో నడవడికను పరిపక్వం చేయడంలో గురుపూజ ఎంతో ఉపమోగపడుతుందని గురుపూజా పండిట్ రామిరెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ ఆర్.ఎస్.కె. హైస్కూల్‌లో నిర్వహించిన గురుపూజా మహోత్సవ కార్యక్రమానికి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆధ్యాత్మికతకు, ఉన్నత వి లువలతో కూడిన విద్యను అందించడమే భారతీయత అని తెలిపారు ఈకార్యక్రమంలో ఆర్.ఎస్.కె. హైస్కూల్ కరస్పాండెంట్ కె.రామేశ్వర్‌రెడ్డి, ఆకాడమిక్ డైరెక్టర్ కె.అరుణ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కవులు, కళాకారులకు కీర్తి పద్మాలు పురస్కారాల ప్రధానం

**చిక్కడపల్లి, మార్చి 6 ప్రభాతవార్త:** అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేనేత కళా వెలుగులు శీర్షికన కవి సమ్మేళనం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో కవులు తమ కవితల్ని వినిపించి ఆహుతుల్ని అలరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అర్హులైన కళాకారులకు, కవులకు కీర్తిపద్మాలు పురస్కారాలను అందజేశారు. కూచిపూడి నాట్యంలో మాస్టర్స్ డిగ్రీ చేసిన నాట్య గురువు కుమారి బి.వేద శ్రీకి కీర్తి పద్మం పురస్కారం, వేద శ్రీ కూచిపూడి నాట్యంలో మాస్టర్స్ డిగ్రీ చేసి అనేక నాట్య ప్రదర్శనలు ఇస్తున్నారు. సిలికాన్ ఆంధ్ర యూఎస్ఏ, ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా నిర్వహించిన 5వ ఐకెడీసీ ప్రపంచ గిన్నిస్ రికార్డ్ స్థాపించారు. ట్రిబుల్ ఐటీ బాసరలో బెస్ట్ కొరియో గ్రాఫర్, చిలకలూరిపేటలో జరిగిన కార్యక్రమంలో నాట్య మయూరి బిరుదును అందుకున్నారు. తిరుమల నాదనీరాజనం, హైదరాబాద్ కోటి దీపోత్సవం, పాలాజ్ ఆలయంలో వినాయక చవితి కార్యక్రమం వంటిఅనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు నాలుగు వందలకు పైగా కార్యక్రమాల్లో కుమారి వేదశ్రీ నాట్య ప్రదర్శనలిచ్చారు. నోవాటెల్ లో జరిగిన జి 20 సదస్సులో మాధురి, రాజభవన్ లో బంజారా నృత్య కార్యక్రమం చేశారు. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఉచిత వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, ఎస్. రవికుమార్, జె.బి. రాజు. అమృత్ కుమార్ జైన్, రామకృష్ణ చంద్రమౌళి, సరోజినీ దేవి, విభా భారతి తదితరులు పాల్గొన్నారు.

## జివో నెంబరు 60 ప్రకారం వేతనాలు పెంచాలి

**సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త:** నేషనల్ హెల్త్ మిషన్ స్కిమ్‌లో డేటా ఎంట్రి ఆపరేటర్‌గా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు జివో నెంబరు 60 ప్రకారం 22 వేల 750 రూపాయలు వేతనం చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కోటిలోని ఎన్‌హెచ్ఎం డైరెక్టర్ కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ్మా మాట్లాడుతూ ఎంతో కష్టపడి పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నర్సింహ్మా నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం డైరెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించింది.

## రాచకాలువను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



రాచకాలువ ఆనవాలును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులతో ఆరవింద్ రెడ్డి

**వనస్థలిపురం. మార్చి, 6. ప్రభాతవార్త :**
ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మహాలక్ష్మీ నగర్, జక్కిడి రామస్వామి కాలనీ దిగువ నుండి, సౌభాగ్య నగర్ తూర్పు భాగం నుండి బృందావన్ మెడోస్ వరకు ఇరిగేషన్ అధికారుల తో కలిసి బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ బి.ఆర్.ఎస్. అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి పరిశీలించారు. ఈ రాచకాలువ గుండా పైపులైన్ నిర్మాణం చేయడానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఒక ప్రణాళిక ను రూపొందించారు. ఇందులో భాగంగా ఇరిగేషన్ డి.ఈ.ఈ. శుక్లజ, ఏ.ఈ.సతీష్, వర్క్ ఇన్స్పెక్టర్ అశోక్ లు రాచకాలువ గుండా సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి క్షేత్రస్థాయిలో రాచకాలువ ఆనవాలును పరిశీలించారు. ఈ సందర్భంగా డి.ఈ. ఈ.మాట్లాడుతూ రాచకాలువ పై నిర్మాణాలు చేపడితే కట్టిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో రాచకాలువ హద్దులను ఏర్పాటు చేస్తామన్నారు.

## బంజారా దళ్ నూతన కమిటీ ఏకగ్రీవం



శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా దళ్ నూతన కార్యవర్గం

**వనస్థలిపురం మార్చి, 6. ప్రభాతవార్త:**
బి ఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాదళ్ సర్వ సభ్య సమావేశము తెలంగాణ రాష్ట్ర సేవాలాల్ సేన అధ్యక్షులు ఆంగోత్ రాంబాబు నాయక్ గారి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ కమిటీ ఏకగ్రీవంగ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా బోడ గన్నా నాయక్, ఇస్లావత్ చందు నాయక్, అధ్యక్షులుగా పాతులోతు రామ కోటి నాయక్, ఉపాధ్యక్షులుగా నేనావత్ సూర్య నాయక్, కేతావత్ అమర్సన్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంటుగా నేనావత్ రవికుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా రాత్లావత్ భరత్ లాల్ నాయక్, కోశాధికారిగా భుక్య రామా నాయక్, సహాయ కార్యదర్శిగా రామావత్ రవి నాయక్, నిర్వహక కార్యదర్శిగా కరంటోత్ రమేష్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ సంద్భంగా నూతన కార్యవర్గ కమిటీ అధ్యక్షులు రామకోటి నాయక్ మాట్లాడుతు దేశంలో దాదాపు 20 కోట్ల మంది బంజారాల ఆరాధ్య దైవంగా పూజించే శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ అందరిని ఏక్ జాత్, ఏక్ వాత్, ఏక్ సాత్ అనే నినాదంతో ఒకతాటిపై నడిపించి జీవన విధానాన్ని బోధించిన సామాజిక ,ఆధ్యాత్మిక యోధుడు అని కొనియాడారు. ఆ మహనీయుడి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఒకతాటిపై ఉంటు బంజార సహోదరుల అభివృది కోసం పాటుపడాలని తెలిపారు. తమపై నమ్మకంతో ఎన్నుకున్న బంజార సహోదరులందరికీ ఏళ్లవేళల అందుబాటులో ఉంటు, కమిటీ సాయశక్తుల మేర సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల అధ్యక్షులు, మరియు సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గ కమిటీకీ శుభాకాంక్షలు తెలిపారు.

## సిసి రోడ్డు పై మట్టి తొలగింపు



సిబ్బందితో సి.సి.రోడ్డు పై మట్టిని తొలగింపజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం. మార్చి. 6. ప్రభాతవార్త.**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బి.యన్ రెడ్డి నగర్ ఫేస్ 3 లో నూతనంగా నిర్మించిన సీ.సీ రోడ్డు పనులు పూర్తయి క్యూరింగ్ కోసం వేసిన మట్టి కుప్పలను తొలగించాలని కాలనీవాసులు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ని కోరడంతో గురువారం సంబంధిత సిబ్బందితో మట్టి కుప్పలను తొలగించారు. ఈ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ ఫేస్ 3 కాలనీ ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేవైఎం సెక్రటరీ పవన్ రెడ్డి, నాయకులు కిషోర్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ లెవల్ టెక్నికల్ ఈవెంట్ ప్రారంభం




టెక్నికల్ ఈవెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు, కళాశాల అధ్యాపకులు

**సైదాబాద్, మార్చి 6 ప్రభాతవార్త:**
ఐఎస్ సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని భోజ్ రెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరుగనున్న నేషనల్ లెవల్ టెక్నికల్ ఈవెంట్ జిజ్ఞాస..2025 గురువారం ప్రారంభమయింది. వివిధ రాష్ట్రాలకు చెందిన విధ్యార్థినీ విద్యార్థులు ఈ టెక్నికల్ ఈవెంట్‌లో పాల్గొంటున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ మాట్లాడుతూ భోజ్ రెడ్డి కళాశాల మహిళల అభ్యుదయానికి పాటుపడడం అభినందనీయమన్నారు. బి కేటగిరి అడ్మిషన్స్‌లో ఉత్తమ పద్దతులను అనుసరిస్తూ అగ్రస్థానంలో ఉందన్నారు. జెఎన్‌టియుహెచ్ ప్రొఫెసర్ ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు జాబ్ సీకర్స్‌గా కాకుండా జాబ్ గీవర్స్‌గా ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ వి.సుధ, సిఓఓ డాక్టర్ సుజాత గంగాధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.మాధవన్‌లు మాట్లాడుతూ జిజ్ఞాస 2025లో విభిన్నమైన పోటీలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ గ్రేసి శైలశ్రీ, ఉప ప్రధానోపాధ్యాయుడు జి.దయాకర్‌రెడ్డి, కన్వీనర్ డాక్టర్ పి.దీప్తి, ఆర్.మంజు భార్గవి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన డిసిపి కార్యాలయానికి శంకుస్థాపన

## -పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు



**నేరేడ్ మెట్, రాచకొండ కమిషనరేట్, మార్చి 6, ప్రభాతవార్త :**
రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్ కు సంబంధించి పోలీసు శాఖకు చెందిన వివిధ పోలీస్ భవనాల నిర్మాణానికై స్థల కేటాయింపు కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఐటి పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు నూతన భవన నిర్మాణ స్థల కేటాయింపు లో భాగంగా వివిధ భవనాల నిర్మాణ సముదాయానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, పోలీస్ శాఖకు కావలసిన అన్ని రకాల సదుపాయాలు సమకూరుస్తూ తోడ్పాటు అందిస్తున్నామని పేర్కొన్నారు. పోలీస్ శాఖను మరింతగా బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో నేరశాతం నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూ, విశేషంగా కృషి చేస్తున్నందుకు కమిషనర్ శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ గారిని మరియు అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు ఐపీఎస్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఐఎఎస్, డీసీపీ మహేశ్వరం సునీత రెడ్డి మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయించాలని వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న వల్లపు సుభాన్ యాదవ్

**సరూర్‌నగర్, మార్చి 6 ప్రభాతవార్త:**
మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజల సౌకర్యార్థం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్ కోరారు. గురువారం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన మంత్రిని పలువురు కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసిన యాదవ్ ఆయనకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటు అవసరాన్ని మంత్రికి వివరించారు. బాలాపూర్ మండలంలో నిత్యం ప్లాట్లు, ఇళ్లు, భూముల క్రయ విక్రయాలు జరుగుతుంటాయనీ అయితే సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం అందుబాటులో లేకపోవడంతో ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తుందనీ ఆ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు కూడా ఉన్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బాలాపూర్ మండలంలో అన్ని ప్రాంతాలకు కేంద్ర బిందువుగా ఉన్న బడంగ్‌పేట్‌లో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయించాలని సుభాన్ యాదవ్ మంత్రిని కోరారు. అదే విధంగా నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయించాలనీ బడంగ్‌పేట్ గాంధీనగర్ సర్కిల్ నుండి నాదర్‌గుల్ వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయించాలనీ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు టిసిఎస్, టాటా, ఎయిరో స్పేస్ తదితర కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. మంత్రికి వినతి పత్రం సమర్పించే కార్యక్రమంలో యాదవ్‌తో పాటు పార్టీ కాంగ్రెస్ నాయకులు బాల్‌నింగని జంగయ్య, క్యారగారి శ్రీధర్, భాను ప్రసాద్, గొల్లూరు రాజు, కప్పల రాజు, బంగారు మురళిలతో పాటు పలువురు ఉన్నారు.

## ఘనంగా శ్రీ కట్టమైసమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపన



కట్ట మైసమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, మార్చి 6 ప్రభాతవార్త :**
రామంతాపూర్ ప్రధాన రహదారిలోని శ్రీ కట్ట మైసమ్మ ఆలయంలో శ్రీ విజయ గణపతి, కాశీ విశ్వేశ్వరస్వామి, సుబ్రహ్మణేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజుల జరుగుతున్న ఈ ఉత్సవాల్లో గురువారం ఆలయంలో శ్రీ విజయ గణపతి, కాశీ విశ్వేశ్వరస్వామి, సుబ్రహ్మణేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. వేద మంత్రోచ్ఛరణాల మధ్య జరిగిన ఈ వేడుకలకు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి, బిజెపి సీనియన్ నేతలు బండారు వెంకట్రావ్, నారాయణదాసు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్‌గుప్త, పి.గోపాల్‌గౌడ్, సంకూరి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపన వేడుకలు వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, నరసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## హెచ్‌సియును సందర్శించిన ఉప్పల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు




హెచ్‌సియును సందర్శించిన ఉప్పల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు దృశ్యం.

**ఉప్పల్, మార్చి 6 ప్రభాతవార్త :** నగరంలోని కేంద్రీ విశ్వవిద్యాలయాన్ని గురువారం ఉప్పల్‌కు చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బిఏ, బికాంలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సందర్శించారు. ఈ సందర్బంగా వారు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం, చరిత్ర, సామానిక శాస్త్రం, వాణిజ్య నిర్వహణ, శాస్త్ర విభాగం అచార్యులు, విద్యార్థులతో మమేకం అయ్యారు. పలు పరిశోధనల గురించి అడిగి తెలుసుకున్నారు. విశ్వ విద్యాలయం గ్రంథాలయం సందర్శించి పోటీ పరీక్షలకు సిద్దమవుతున్న విద్యార్థులతో పలు అంశాలను చర్చించారు. బికాం విద్యార్థులకు నిర్వహణ శాస్త్ర అచార్యులు పి.రాజశేఖర్ నిర్వహణ శాస్త్రంలో ఉపాధి అవకాశాలు అనే అంశంపై వివరించారు. విద్యార్థులకు ఎంకాం, ఎంబిఏలతో కేరియర్ ఎలా ఉంటుందనే అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా.సి.హెచ్.సత్యనారాయణ, డా.ఎన్.రాజశ్రీ, విజయ్‌కుమార్, పి.వెంకటేశ్వర్లు, దామోదర్ పాల్గొన్నారు.

## సతీష్ కుమార్‌ను పరామర్శించిన మైనంపల్లి హనుమంత రావు



**మల్కాజిగిరి ఫిబ్రవరి6, ప్రభాతవార్త :**
కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జివన్వి సతీష్ కుమార్ ను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరామర్శించారు. ఇటీవల యాక్సిడెంట్ లో కాలు ఫ్రాక్చర్ అయింది విషయం తెలుకుని గురువారం సతీష్ కుమార్ నివాసం లో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ వెంకటేష్ యాదవ్ ,నక్క ప్రభాకర్ గౌడ్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, సంతోష్ రాందాస్ ముదిరాజ్, కన్నా, ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు

### నాదర్‌గుల్‌లో ధ్వజ స్థంభ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం



నాదర్‌గుల్ విష్వక్సేన సహిత శ్రీ సీతారామ భక్తాంజనేయ స్వామి ఆలయం

**సరూర్‌నగర్, మార్చి 6 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో నున్న శ్రీ విష్వక్సేన (గణపతి) సహిత శ్రీ సీతారామ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం నూతన ధ్వజ స్థంభ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొత్తగా ధ్వజ స్థంభాన్ని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో 9వ తేదీ ఆదివారం వరకు ధ్వజ స్థంభ ప్రతిష్టాపనోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం విష్వకే ్సన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం యజ్ఞశాల ప్రవేశం, శనివారం ధ్వజాబిషేకం, ఆదివారం ప్రాణ ప్రతిష్ట, యంత్ర స్థాపన జరిపిన అనంతరం ఉదయం 10.53 గంటలకు ధ్వజ స్థంభం ప్రతిష్ట చేయనున్నట్లు దేవస్థానం కమిటీ ఛైర్మన్ ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కందాడి శ్రీరాంరెడ్డిలు తెలిపారు.

## కుమ్మక్కు రాజకీయాల వల్లే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి విజయం: రాఘువేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 6 ప్రభాతవార్త:** తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపితో బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు చేయడం వల్లే బిజెపి విజయం సాధించిందని మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి పాలవ్వడంపై ఆయన స్పందిస్తూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకు చెక్కు చెదరలేదనీ అయితే కాంగ్రెస్ ఎక్కడ గెలుస్తోందననే భయంతో బిఆర్ఎస్ బిజెపితో చీకటి ఒప్పందాలు చేసుకొని పరోక్షంగా ఆ పార్టీ అభ్యర్థుల విజయానికి దోహదపడిందని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల ముందు నుండే బిఆర్ఎస్, బిజెపిల మధ్య లోపాయికారిగా కుమ్మక్కు రాజకీయాలు నడుస్తున్నాయని ఆయన అన్నారు. ఈ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్‌లో కుంగుబాటు ఉండదనీ బిజెపికి ఈ విజయాలు తాత్కాలికమేనని రాఘవేందర్ స్పష్టం చేశారు.

## జయ సూర్యపట్నంలో సిసి రోడ్ల నిర్మాణం

**సరూర్‌నగర్, మార్చి 6 ప్రభాతవార్త:**
బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 8వ డివిజన్ నాదర్‌గుల్ జయ సూర్యపట్నంలో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణపు పనులు గురువారం స్థానిక మాజీ కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో పర్యటించి రోడ్డు నిర్మాణపు పనులను పర్యవేక్షించి నాణ్యతగా వేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గడచిన ఐదేళ్లలో డివిజన్‌లో ప్రజలు కోరిక మేరకు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేయించామని ఇంద్రసేన స్పష్టం చేశారు.

## విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి

### -కళాశాల ఇంచార్జ్ గౌని చంద్రయ్య గౌడ్




విద్యార్థులకు నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న కళాశాల ఇంచార్జ్ గౌని చంద్రయ్య గౌడ్, ప్రిన్సిపాల్ ప్రేమలేఖ తదితరులు

**మలక్ పేట ,మార్చి 6, ప్రభాతవార్త:** విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని న్యూ నోబుల్ డిగ్రీ కళాశాల ఇన్ చార్జి గౌని చంద్రయ్య గౌడ్, ప్రిన్సిపాల్ ప్రేమలతలు పేర్కొన్నారు. న్యూ నోబుల్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం తమ కళాశాలలో వివిధ బహుళ జాతి కంపెనీల ప్రతినిధులతో క్యాంపస్ డ్రైవ్ ను నిర్వహించడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. క్యాంపస్ డ్రైవ్ లో సుమారు 50 మందికి నియామకపు ఉత్తరులను అందజేయడం జరిగిందని వివరించారు . తరచుగా తమ కళాశాలలో విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ రాళ్ల బండి లంకేశ్వరాచారి జ్ఞానపటిమా అద్వితీయం

### ఆదిశంకరాచార్య వేద ధర్మ పీఠం వ్యవస్థాపకులు వెంకటాచార్యులు



డాక్టర్ లంకేశ్వరాచార్య విరచిత శ్రీ విశ్వా వసు నామ సంవత్సర వైస్వకర్మణ పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ పడకండ్ల వెంకటాచార్య...

**కుషాయిగూడ, మార్చి6 ప్రభాతవార్త:**
శ్రీ విశ్వ వసు నామ సంవత్సర వైస్వకర్మణ పంచాంగ గుణిత విరచిత డాక్టర్ లంకేశ్వరాచార్య జ్ఞానపటిమా అద్వితీయమని చర్య వేద ధర్మ పీఠం వ్యవస్థాపకులు ,వేదాగమ జ్యోతిర్వాస్తు పండితులు, మార్గ సహాయ చర్య బిరుదాంకితులు, ప్రతిష్టాచార్యులు, స్వర్ణ మకర కుండల సింహ కంకణ కనకాభిషేక విభూషితులు, బౌ గ్రంధకర్త వేదమూర్తులు డాక్టర్ పడకండ్ల వెంకటాచార్యులు పేర్కొన్నారు. అతి పిన్న వయసులోనే పంచాంగ గ్రంథ రచనలు చేస్తూ జ్ఞానపరంగా వైశ్య కర్మణ; జాతిలో గొప్ప పేరును సంపాదించిన పురోహితరత్న బ్రహ్మశ్రీ రాళ్ల బండి లంకేశ్వరాచార్యులు సిద్ధాంతి చే గుణించిన రచించిన శ్రీ విశ్వాసు నామ సంవత్సర వైశ్య కర్మణ పంచాంగాన్ని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశ్య కర్మణ వైశ్య బ్రాహ్మణ జాతిలో అనేకమంది పురోహిత మేధావులు ఉన్నారని వారి జ్ఞానాన్ని గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మానవ సమాజంలో మానవహితం కోసం మార్గ దర్శక సూచికగా, మార్గదర్శకాలుగా పంచాంగాలు ఎంతగానో దోహదపడతా యని పంచాంగ కర్త లంకేశ్వరాచార్యులు పేర్కొన్నారు.

## డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని వినతి



జలమండలి జీఎంతో మాట్లాడుతున్న కార్పొరేటర్, కాలనీవాసులు

**హయత్‌నగర్, మార్చి 6 ప్రభాతవార్త:** డివిజన్ పరిధిలోని శివారు కాలనీలకు సైతం కనీస సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బ్లడ్‌బ్యాంకు కాలనీ ప్రతినిధులు గురువారం జల మండలి జీఎంను కోరారు. కాలనీలో పూర్తిస్థాయిలో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

## యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి : ఎంపిఆర్



యూత్ కాంగ్రెస్ నేతలకు నియామక పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, అకారపు అరుణ్ తదితరులు

**ఉప్పల్, మార్చి 6 ప్రభాతవార్త :** యూత్ కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యమంలో మల్లాపూర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ కమిటిని ఎన్నుకున్నారు. యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా గడ్డం వినేష్ యాదవ్, ఉపాధ్యక్షునిగా రాకేష్‌గౌడ్, కార్యనిరవ్వన కార్యదర్శిగా పర్వేస్‌లను నియమించారు. పరమేశ్వర్‌రెడ్డి, అరుణ్ పటేల్ చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుపుల జయంత్‌గౌడ్, అఖిల్, రేవంత్, రాకేష్, మణిదీప్, పలువురు యూత్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## తల్లి, కూతురు ఆదృశ్యం.




కన్పించకుండా పోయిన ఆశ ,నిఖిత

**హయత్‌నగర్, మార్చి 6 ప్రభాతవార్త:** ఫోన్ చాటింగ్ విషయమై భర్తతో జరిగిన గొడవ కారణంగా వివాహిత కూతురుతో సహా ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... కుంట్లూర్ గ్రామం రావినారాయణరెడ్డి కాలనీకి చెందిన గుమ్మడి స్వామి, అతని భార్య ఆశ(35)కు 2010 ఏడాదిలో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుళ్లు. ఈనెల 5న రాత్రి 8 గంటల సమయంలో ఆశ ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేస్తుండగా భర్త ప్రశ్నించాడు. ఆమె సరిగా సమాధానం చెప్పక పోవడంతో ఇరువురి మధ్య గొడవ జరిగింది. అనంతరం స్వామి భార్యను తీసుకుని అంజనాద్రినగర్‌లోని తన సోదరి ఇంటికి వెళ్లాడు. ఆశను, కూతురు నిఖితను అక్కడే ఉంచి అతను తిరిగి రావినారాయణరెడ్డి కాలనీకి వెళ్లాడు. రాత్రి 9.30 గంటల సమయంలో స్వామికి రజిత ఫోన్‌చేసి ఆశ, నిఖితలు ఇంటికి వెళ్తున్నామని ఇంటినుంచి వెళ్లిపోయారని చెప్పింది. అయితే...రాత్రయినా వారు ఇంటికి చేరకపోవడంతో వారి గురించి స్నేహితులను విచారించారు. ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి విజయంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపింది : బిక్షపతిచారి



కార్యకర్తలకు మిఠాయిలు తినిపిస్తున్న మీర్‌పేట్-1 బిజెపి అధ్యక్షుడు బిక్షపతిచారి

**సరూర్‌నగర్, మార్చి 6 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి విజయ దుందుభి మ్రోగించడం పట్ల పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం నింపిందని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్-1 బిజెపి అధ్యక్షుడు పసునూరి బిక్షపతి చారి అన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు మల్క కొమురయ్య, సి.అంజిరెడ్డిలు విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మీర్‌పేట్ చౌరస్తా, జిల్లెలగూడ వివేకానంద చౌరస్తాల్లో బిజెపి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా బిక్షపతి చారి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మిఠాయిలు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇక ఏ ఎన్నికలు వచ్చినా బిజెపిదే విజయం అన్న భరోసా పార్టీలో శ్రేణుల్లో కలుగుతున్నదని అన్నారు. ఈ విజయోత్సవ సంబరాల్లో నాయకులు కీసర గోవర్ధన్‌రెడ్డి, కోడూరు సోమేశ్వర్, మద్ది రాజశేఖర్‌రెడ్డి, తులసి ముఖేష్ ముదిరాజ్, కీసర హరినాథ్‌రెడ్డి, కొండ్రు గౌరీ శంకర్, కీసర కృష్ణారెడ్డి, గడ్డం జగన్, జెడి కుమార్, తిరుపతిరెడ్డి, బచ్చనమోని కాశీరాం యాదవ్, ఆవుల సత్తయ్య, మెకం సుధాకర్, విక్కీ సాగర్, మహిళా నాయకురాళ్లు రజని, లత, కాసోజు అర్పిత రాధాకృష్ణ, హరిత తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో పారిజాత



శ్రీధర్‌బాబు, మహేందర్‌రెడ్డి, కెఎల్‌ఆర్, చల్లా, అనితారెడ్డి తదితరులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న పారిజాత

**సరూర్‌నగర్, మార్చి 6 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధి కిందకు వచ్చే రావిర్యాలలో నూతనంగా నిర్మిస్తున్న మహేశ్వరం డివిజన్ డిసిపి భవన నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ అదే విధంగా లెన్స్ కార్ట్ పరిశ్రమ ఏర్పాటు భూమి పూజ, మహేశ్వరం, కందుకూరు మండలాల్లో అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమాల్లో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. వాటికి శ్రీకారం చుట్టడానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా మంత్రి, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుతో పాటు శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టియుడిఎఫ్ఐడిసి ఛైర్మన్, రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి తదితరులతో కలిసి ఆమె పాల్గొన్నారు.

## ప్రతి శని ఆదివారాలలో స్వర్ణగిరి దేవాలయానికి ప్రత్యేక బస్సులు : డిపో మేనేజర్

**మలక్ పేట మార్చి 6 , ప్రభాతవార్త:**
దిల్ షుక్ నగర్ డిపో నుండి ప్రతి శనివారం, మరియు ఆదివారం స్వర్ణగిరి టెంపుల్ కు (వయా.ఎల్‌బి నగర్, ఉప్పల్ రోడ్ మరియు ఘట్కేశర్ ) మెట్రో డీలక్స్ బస్సులను నడుపుతున్నట్లు దిల్ షుక్ నగర్ డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. దిల్‌షుక్ నగర్ నుండి ఉదయం.8.00గంటలకు ప్రారంభం అయ్యి స్వర్ణగిరి నుండి సాయంత్రం 6.00 వరకు, ప్రతి ఒక గంట 40 నిమిషాలకు బస్సు సౌకర్యం కలదని వివరించారు. కావున ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని దిల్ షుక్ నగర్ డిపో ఆర్టీసీ మేనేజర్ పేర్కొన్నారు.

## ఆలయ నిర్మాణానికి కాంటెస్టెడ్ కార్పొరేటర్ విరాళం



చెక్కును అందజేస్తున్న రామిడి జ్యోతి నర్సి రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 6 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని టీచర్స్ కాలనీలో నిర్మిస్తున్న శ్రీ భవానీ రామ లింగేశ్వర స్వామి, అభయ అయ్యప్ప స్వామి సమేత శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి నందిహిల్స్ నివాసి, కార్పొరేషన్ 9వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ రామిడి జ్యోతి నర్సిరెడ్డి రూ.50 వేల విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణానికి తమ వంతుగా కుటుంబం తరపున రూ. లక్ష ప్రకటించిన జ్యోతి నర్సిరెడ్డి మొదటి విడతగా యాభై వేల రూపాయలకు సంబంధించిన చెక్కును ఆలయ, కాలనీ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డితో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.